సాక్షి
నారాయణపేట
సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



తల్లీబిడ్డలకు పౌష్టికాహారం
మాతాశిశువుల సంరక్షణ, ఆరోగ్యంపై ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిసారించాయి.
వివరాలు 8లో ▸



జూరాలకు పెరిగిన వరద
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద స్వల్పంగా పెరిగింది.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /23.1

వాతావరణం
ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

మెడికల్‌ ఆఫీసర్‌ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నారాయణపేట: జిల్లాలో పీహెచ్‌సీలలో ఖాళీగా ఉన్న ఏడు మెడికల్‌ అధికారుల పోస్టులను కాంట్రాక్ట్‌ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హలైన ఎంబీబీఎస్‌ డాక్టర్లు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌ శైలజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతలు ఉన్న అభ్యర్థులు ధ్రువపత్రాలు, దరఖాస్తు ఫారంతో సెప్టెంబర్‌ 19 నుంచి 26 వరకు జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. మిగతా వివరాలకు ఫోన్‌ నంబర్‌ 9866356577ను సంప్రదించాలని తెలిపారు.

తప్పుడు ధ్రువపత్రాలు ఇస్తే చర్యలు

నారాయణపేట రూరల్‌: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఎవరైన తప్పుడు ధ్రువపత్రాలను సమర్పిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని డీఈఓ ఎండీ అబ్దుల్‌ ఘని హెచ్చరించారు. 2018లో స్పౌజ్‌ ఉపయోగించి బదిలీ అయిన వారు ఈ సారి వాడు కోరాదన్నారు. నకిలీ బీఈడీ, పీజీ సర్టిఫికెట్లు, గుర్తింపులేని యూనివర్సిటీలకు సంబంధించినవి ఉన్నా, మెడికల్‌ సర్టిఫికెట్లను దుర్వినియోగం చేస్తే సీసీఏ చట్టం ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి: వట్టెం జవహర్‌ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్‌ భాస్కర్‌కుమార్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చేనెల 31లోగా www.navodaya.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ చరిత్రను వక్రీకరించే కుట్ర

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే కుట్ర జరుగుతుందని పీయూ అధ్యాపకులు భూమయ్య అన్నారు. ఆదివారం పీయూలో వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట అమరులను స్మరించుకుందామనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాటం ద్వారా తెలంగాణ భారతదేశంలో విలీనమైందని, కానీ, ప్రస్తుత నేతలు దానిని వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీజేపీ విమోచన దినోత్సవం, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం మాత్రం సమైక్యతా దినం పేరుతో పిలుస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తుందన్నారు. నాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో యువత బలి అయ్యారని పేర్కొన్నారు.

దేశానికే ఆదర్శం తెలంగాణ

- తొమ్మిదేళ్ల పాలనలో ఎంతో అభివృద్ధి
- జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కంకణబద్ధులమవుదాం
- తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవంలో రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ వాకిటి సునీత
- కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణ

నారాయణపేట: ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ తొమ్మిదేళ్ల పాలనలో ఎన్నో అద్భుత విజయాలు సాధించిందని.. ఏ రాష్ట్రంలో అమలు కానీ సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్‌ సారథ్యంలో రాష్ట్రంలో అమలయ్యాయని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు. తెలంగాణ జాతీయ సమైఖ్యత దినోత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ వనజమ్మ, కలెక్టర్‌ కోయ శ్రీహర్ష, ఎస్పీ ఎన్‌.వెంకటేశ్వర్లు, మక్తల్‌ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డితో కలిసి పోలీస్‌ పరేడ్‌ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్‌ శాఖ ద్వారా కలెక్టర్‌తో కలిసి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ఆమె ప్రసంగించారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానీ సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవులు చేస్తూ సబ్బండ వర్గాల అభ్యున్నతికి అడుగులు వేస్తోంది కేసీఆర్‌ సర్కార్‌ అని వాకిటి సునీత అన్నారు. రైతుబంధు, రైతబీమా, ఉచిత విద్యుత్‌, చేనేత కార్మికుల సంక్షేమం చేపట్టిందన్నారు. పల్లె,పట్టణ ప్రగతి ద్వారా కనీస అవసరాలు తీర్చిన ఘనత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానిదేనని అన్నారు. అంతకుముందు రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరులకు ఘన నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. నారాయణపేట చేనేత వస్త్రాలు, బంగారు ఆభరణాలకు ప్రసిద్ధిగాంచిందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు.. జిల్లా అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించిందంటూ జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ వాకిటి సునీత

ఆసరాతో భరోసా..

జిల్లాలో ఆసరా పింఛన్‌లో వృద్ధాప్య, వితంతువు, చేనేత, కల్లుగీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి స్త్రీలు, ఎయిడ్స్‌ బాధితులు, ఫైలేరియా బాధితులకు రూ. నెలకు రూ. 2,016లు, వికలాంగులకు రూ. 4,016 చొప్పున ఆసరా పెన్షన్‌ ద్వారా 79,245 మందికి రూ. 18.51 కోట్లు ఇస్తుందన్నారు. జీఓఎంఎస్‌25 ప్రకారం జూలై 2023 నుంచి దివ్యాంగులకు పించన్‌ రూ.3,016 నుంచి రూ.4,016 కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి అందిస్తున్నదన్నారు.

పల్లెల్లో ప్రగతి పరుగులు..

పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 280 జీపీల్లో వైకుంటధామాలు నిర్మించి చనిపోయిన వారి భౌతిక కాయాలకు సగౌరవంగా దహనక్రియలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. తెలంగాణ హరితహారంలో 9వ విడత హరితహారంలో జిల్లాకు 15 లక్షల మొక్కలు నటేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా లక్ష్యంతో జిల్లాలోని 13 మండలాల్లో ప్రణాళికలు సిద్ధం చేసి వంద శాతం మొక్కలు నాటారన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో రూ.50 కోట్లతో పనులు ప్రారంభించినట్లు వివరించారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం..

ఎస్సీ,ఎస్టీల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దళితబంధు పథకం కింద 183 మంది లబ్ధిదారులకు యూనిట్లను మంజూరు చేసిందన్నారు. 2022–23 విద్య సంవత్సరానికి గాను పోస్ట్‌మెట్రిక్‌ ఉపకార వేతనాలను ప్రభుత్వం నుంచి రూ.24.13 లక్షలు విడుదల చేయడంతో రూ. 22.53 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

రక్షణ రంగంలో..

జిల్లాలో శాంతి భద్రతల కల్పనలో భాగంగా పోలీస్‌శాఖ నుంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి రూ.2.79 కోట్లతో ధన్వాడ పోలీస్‌ స్టేషన్‌, పేట రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ భవనానికి రూ. 2.79 కోట్లు మంజూరై పనులు చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా మైనార్టీల సంక్షేమం కోసం జిల్లాలో ఇప్పటి వరకు 106 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించారన్నారు. అలాగే బీసీ బంధుతో 591 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహకం అందించరన్నారు.



జాతీయ పతాకానికి సెల్యూట్‌ చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ వాకిటి సునీత, జెడ్పీ చైర్‌పర్సన్‌, కలెక్టర్‌ తదితరులు

మహిళా, శిశు సంక్షేమం

ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా 5,383 గర్భిణులు, 4,551 బాలింతలకు ఒక పూట సంపూర్ణ భోజనం అంగన్‌వాడీల్లో అందిస్తున్నారన్నారు. ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలు 21,875 మందికి నెలకు బాలామృతం ప్యాకెట్‌, 16 గుడ్లను టిక్‌ హోం రేషన్‌ ద్వారా అందిస్తున్నమన్నారు. చేనేత బీమా కింద ఇప్పటి వరకు ఆరుగురు మరణించగా వారి నామినికీ ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ప్రిమియం మంజూరు చేసినట్ల వివరించారు. కల్యాణలక్ష్మి కింద 1,390 మందికి రూ. 13.92 కోట్లు, షాదీముబారక్‌ పథకం కింద 187 మంది కి 1.87 కోట్లు అందించరన్నారు.

540 పాఠశాలల్లో మౌలిక వసతులు..

మన ఊరు మనబడి పథకం కింద 679 పనులకుగాను రూ.2,877.74 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. అందులో 540 పాఠశాలలకు మరుగుదొడ్లు, 51 వంట గదులు, 88 పాఠశాలల ప్రహరీ గోడలు వివిధ దశల్లో ప్రగతిలో ఉన్నాయన్నానరు. రూ.127.91 కోట్లతో నారాయణపేటలో 6.937 కి.మీ రెండు వరుసల రహదారులను నాలుగు వరసల రహదారులగా అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, రూ.55 కోట్లతో సమీకృత జిల్లా అధికారుల కార్యాయలాన్ని, వసతి గృహాల కోసం రూ.8.50 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మక్తల్‌లో అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో అడిషన్‌ కలెక్టర్లు మయాంక్‌ మిత్తల్‌, ఆశోక్‌కుమార్‌, గ్రంథాలయ చైర్మన్‌ రామకృష్ణ, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గందెఅనసూయ, ఏఎస్పీ నాగేంద్రుడు, అధికారుల పాల్గొన్నారు.

రైతుబంధు రూ.2,188 కోట్లు

సీఎం కేసీఆర్‌ నేతృత్వంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. రైతుబంధు పథకం కింద 2018 నుంచి 2023 వరకు రూ.2,188.93 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు బీమా పథకం కింద 1,06,200 మంది రైతులను నమోదు చేసి అర్హులుగా గుర్తించారన్నారు. 3,719 మంది రైతుల కుటుంబాలకు రైతుబీమా పథకం కింద రూ.5 లక్షల చొప్పున 185.96 కోట్లు నామినీ ఖాతాల్లో జమచేయడంతో రైతులు దీమా వ్యక్తం చేస్తున్నారన్నారు.



పోలీసుల గౌరవ వందనం..

మత్స్యకారులకు 1.87 కోట్ల చేప పిల్లల విత్తనాలు

జిల్లాలోని మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చెరువుల్లోచేప పిల్లలను వదలడం జరుగుతుందని ఈ ఏడాది 1.87 కోట్ల చేప పిల్లల విత్తనాలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రమాదవాశాత్త మత్సకారులు చనిపోతే వారి కుటుంబాలకు రూ. 5 లక్షలు ప్రమాద బీమా అందిస్తుందని, గొల్ల, కురుమ, యాదవ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి, మాంసోత్పత్తిని పెంపొందించేందకు గొర్రెల అభివృద్ధి పథకంలో భాగంగా మొదటి విదతలో 9,938 మందికి, రెండవ విడతలో 144 యూనిట్లను అందించినట్లు వెల్లడించారు.

జాతీయ క్రీడల్లో ప్రతిభ చాటాలి

మహబూబ్‌నగర్‌ క్రీడలు: జాతీయ క్రీడల్లో తెలంగాణ నెట్‌బాల్‌ జట్టు ప్రతిభచాటి చాంపియన్లుగా నిలవాల ని నెట్‌బాల్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ తెలంగాణ అధ్యక్షుడు విక్రమాదిత్యరెడ్డి అన్నారు. గోవా రాష్ట్రం పంజిమ్‌లో వచ్చేనెల 22 నుంచి 27 వరకు జరిగే 37వ జాతీయ క్రీడల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర పురుష, మహిళా నెట్‌బాల్‌ జట్టు, మహిళల ఫాస్టెస్‌ 5 నెట్‌బాల్‌ జట్టు ఎంపికలను ఆదివారం జిల్లాకేంద్రంలోని ప్రధాన స్టేడియంలో నిర్వహించారు. ఎంపికలను విక్రమాదిత్యరెడ్డి ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ జాతీయ క్రీడల్లో సమష్టిగా ఆడితే విజయం సాధించవచ్చన్నారు. గతంలో నెట్‌బాల్‌ జట్టు పలు జాతీయస్థాయి టోర్నీల్లో రా ణించారని, ఇదే స్ఫూర్తితో జాతీయ క్రీడల్లో విజేతగా నిలిచి తెలంగాణకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రనెట్‌బాల్‌ సంఘం ప్రధాన కార్యదర్శి ఖాజాఖాన్‌ మాట్లాడుతూ ఈ ఎంపికలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 65 మంది పురుషులు, 48 మహిళలు హాజరయ్యారన్నారు. ఎంపికలకు చైర్మ న్‌గా సాదత్‌ఖాన్‌, కన్వీనర్‌గా సోహైలుర్‌ రెహమాన్‌, సభ్యులుగా మనోజ్‌కుమార్‌, అంజద్‌అలీ, జ్యోతి, జా తీయ నెట్‌బాల్‌ ఫెడరేషన్‌ పరిశీలకుడిగా రాంమోహన్‌గౌడ్‌, శాట్‌ పరిశీలకుడిగా డీవైఎస్‌ఓ ఎస్‌.శ్రీనివాస్‌, రాష్ట్ర ఒలింపిక్‌ పరిశీలకుడిగా కురుమూర్తిగౌడ్‌, ఎంపిక కమిటీలో వ్యవహరించారు. ప్రాబబుల్స్‌లో పురుష లు 25 మంది, మహిళలు 37 మందిని ఎంపిక చేశామని, వీరికి ప్రత్యేక కోచింగ్‌ క్యాంప్‌ నిర్వహించి ప్రతిభ కనబరిచేవారిని తుదిజట్టుకు ఎంపిక చేస్తామన్నారు.

ముమ్మాటికి విద్రోహమే..



నారాయణపేట: సెప్టెంబర్‌ 17 తెలంగాణ విమోచన దినంకాదని మూమ్మటికి విద్రోహ దినమేనని సీపీఐ, ఎంఎల్‌ ప్రజాపంథా పార్టీ డివిజన్‌ కార్యదర్శి కాశీనాథ్‌ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్‌ భవన్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన 3వేల మంది పోరాటయోధులను వెంటాడారని, కమ్యూనిస్టు నాయకులను ఊచకోత, సైనిక చర్యతో అణిచివేశారన్నారు. దున్నే వాడికి భూమి కావాలని నిజాంకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడారన్నారు. 10 లక్షల ఎకరాల భూములు పంచడంతోపాటు, మూడు వేల గ్రామాలను విముక్తి చేశారన్నారు. సాయుధ రైతాంగ పోరాటం దాటికి తట్టుకోలేక పటేల్‌ పట్వారిలో భూస్వాములు గ్రామాలు విడిచారని, నిజాం ఓటమి తప్పదని గ్రహించి పారిపోయారన్నారు. బి.నరసింహా, ప్రశాంత్‌, నారాయణ, సాదిక్‌, సలీం, సాయికుమార్‌, గౌస్‌, వెంకటేశ్‌, లాలూప్రసాద్‌, సురేశ్‌, దొడ్డి లక్ష్మణ్‌, దేవేందర్‌ పాల్గొన్నారు.

చంద్రగఢ్‌ దశ మారేనా?

18వ శతాబ్దంలో కోట నిర్మాణం

- శిథిలావస్థకు చేరుతున్న గోడలు
- పట్టించుకోని పాలకులు
- పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోని వైనం
- మంత్రి హామీతోనైనా ముందడుగు పడేనా..



చంద్రగఢ్‌ కోట

అమరచింత: ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యంత పురాతన కట్టడాల్లో చంద్రగఢ్‌ కోట ఒకటి. చుట్టూ రాతితో నిర్మించిన కోట చూడగానే అప్పటి నిర్మాణశైలి గుర్తుకొస్తుంది. అలాంటి కోట శిథిలావస్థకు చేరడంతో పాటు పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో చరిత్ర కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

■ 18వ శతాబ్దంలో మరాఠా రాజుల కాలంలో బాజీరావు పీశ్వా ఆత్మకూర్‌ సంస్థానానికి సంబంధించి పన్ను వసూలు చేయడానికి చంద్రసేనుడిని నియమించారు. చంద్రసేనుడు ఈ ప్రాంతంలోని ధర్మాపురం గ్రామానికి ఉత్తర దిశగా ఉన్న ఎత్తైన కొండపై ఈ కోట నిర్మించారు. చంద్రసేనుడు ఇక్కడి నుంచే వివిధ సంస్థానాధీశుల నుంచి పన్నులు వసూలు చేసి మరాఠాకు పంపేవాడు. చంద్రసేనుడు నిర్మించిన కోట కావడంతో దీనికి చంద్రగఢ్‌ కోటగా నామకరణం చేశారు. నేడు ఇక్కడ ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్య పూజలతో పాటు ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

శత్రువుల కదలికలను గుర్తించేందుకు..

కోట పైభాగంలో ఉండే సైనికులు శత్రు సైనం దండెత్తడానికి వస్తే సుమారు పది కిలోమీటర్ల దూరం నుంచి పసిగట్టి ఫిరంగులతో దాడి చేసేందుకు వీలుగా కోటగోడ భాగంలో భారీ రంధ్రాలను ఏర్పాటు చేశారు.

రాతి కొలనులు..

కోటపై ఉండే రక్షకభటులతో పాటు సిబ్బంది తాగునీటి కోసం రాతి పొరలను తొలిచి నీటి చెలిమలు గుర్తించారు. దీంతో అన్నికాలాల్లో ఇక్కడి కొలనుల్లో నీరు పుష్కలంగా ఉంటుంది. సాక్షాత్తు పరమశివుడు కొలువైన గుట్ట కావడంతోనే గంగమ్మ తల్లి ఇక్కడ కొలువైందని భక్తులు విశ్వసిస్తారు. ఈ కొలనుల్లో తామరపూలు సైతం ఉండటం విశేషం.

పర్యాటక మంత్రి హామీతోనైనా..

అమరచింతలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ చంద్రగఢ్‌ కోటను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నివేదిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి సూచించారు. మంత్రి హామీతో చంద్రగఢ్‌ కోట పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కోటకు మరమ్మతులు చేయించి పార్క్‌లు ఏర్పాటుచేస్తే వివిధ ప్రాంతాల నుండి పర్యాటకులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. మంత్రి చొరవతో చంద్రగఢ్‌కు పూర్వ వైభవం రావాలని, ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరుతున్నారు.

ఇదీ ప్రస్తుత పరిస్థితి..

ప్రస్తుతం కోటలోని రాతి గోడలు శిథిలావస్థకు చేరాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌ కోటను సందర్శించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అప్పట్లో కేవలం కోటపైకి వెళ్లడానికి వీలుగా సీసీ రహదారి నిర్మించి వదిలేశారు. నాటి నుంచి ఇప్పటి వరకు చంద్రగఢ్‌ కోటను పట్టించుకునే వారే కరువయ్యారు.

కొలువుదీరనున్న గణపయ్య

ఉమ్మడి జిల్లాలోనే 'పేట' ఉత్సవాలు ప్రత్యేకం

- 11 రోజులపాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- మండపాల ఏర్పాటుకు పోటాపోటీ సన్నాహాలు
- ప్రత్యేక వాహనాల్లో వినాయకుడి ప్రతిమలను తరలిస్తున్న యువకులు
- పూజా సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడిన మార్కెట్లు



వినాయకుడి ప్రతిమలను కొనుగోలు చేసి గుర్మిట్కల్‌కు తీసుకెళ్తున్న యువకులు

నారాయణపేట/నారాయణపేట రూరల్‌: చేనేత పట్టు చీరలు.. మేలిమి బంగారం.. వినాయక ఉత్సవాలు.. వీటన్నింటిలో రాష్ట్రంలోనే నారాయణపేట ప్రత్యేక పేరొంది. ఈ ఏటా మరింత ఉత్సవంగా గణేశ్‌ ఉత్సవాలను నిర్వహించేందుకు వాడవాడలా, పోటాపోటీగా సన్నాహాలు ప్రారంభించారు. సెప్టెంబర్‌ 18న సోమవారం రకరకాల ఆకృతుల్లో చిన్న, పెద్ద సైజ్‌లో పట్టణమంత సుమారు 250 పైగా వినాయక విగ్రహాలను భక్తి గీతాలు అలపిస్తూ, భజనలతో ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠాపన చేసేందుకు వినాయక మండపాల నిర్వహకులు సిద్ధం అవుతున్నారు. జిల్లా అంతటా దాదాపు 2వేల వరకు గణనాథుల విగ్రహాలను ప్రతిష్టించే అవకాశం ఉందని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. ఎక్కడైన 3, 5, 7, 9 రోజులపాటు ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనం చేస్తారు, కానీ ఇక్కడ 11 రోజులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, భజనలు, నైవేద్యాలు సమర్పించి సాంస్కృతిక, అధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించి ఉత్సవాలను అత్యంత వైభవంగా చేపడతారు.

స్వాతంత్ర్యానికి ముందు నుండే సంబురాలు..

1940వ సంవత్సరంలో పేట పట్టణంలో మొట్టమొదటిసారిగా నాగర్‌కర్‌ కిషన్‌రావు అనే స్వాతంత్ర్య సమరయోధుడు స్థానిక బ్రహ్మణవాడలో ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారని పెద్దలుచెబుతారు. మహారాష్ట్రతో సంబంధాలు, వ్యాపార సంబంధాలు ఈ ప్రాంతం వారికి అధికంగా ఉండటంతో ఆ సంస్కృతి, ప్రభావడం ఇక్కడి ఆచార వ్యవహారాలపై బలంగా పడింది. ముంబాయి, పూణే, సోలాపూర్‌లలో 11 రోజులు తర్వాత అనంత చతుర్ధశి రోజు నిమజ్జనం చేస్తారని, అది శ్రేయమని మహారాష్ట్ర పెద్దల ద్వారా గ్రహించిన వీరు దీనినే ప్రామాణికంగా తీసుకున్నారు. 1948లో బ్రహ్మణ, వైశ్య కమీటిలను ఏర్పాటు చేసి మెలమెల్లగా ఏటేటా పోటాపోటీగా ఏర్పాట్లు పెరిగాయి. పట్టణంలోని ఎనలేని ప్రాధాన్యత వినాయక నిమజ్జన వేడుకలకు గుర్తింపు వస్తుంది. వినాయక ఉత్సవాలు పూణేలోనే అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పడే నారాయణపేటలో ఈ ఉత్సవాలు ఘనంగా జరుతాయని ప్రతీక.

మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో..

మండపాల్లో వినాయకుడి ప్రతిమలను ప్రతిష్ఠించే ముందు పోలీస్‌శాఖ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని పోలీసుశాఖ సూచిస్తోంది. దీంతో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసుల సూచనలను పాటిస్తూ అనుమతులు పొందుతున్నారు. ఈ ఉత్సవాల్లో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ ఎన్‌.వెంకటేశ్వర్లు నేతృత్వంలో పోలీసుశాఖ పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తోంది.

పర్యావరణ పరిరక్షణలో మేము సైతం



రంగులు అద్దిన అందమైన విగ్రహాలను కొనాలనే ఆలోచనకు స్వస్తి చెప్పి మట్టి విగ్రహాలను పూజించి పర్యవరణ పరిరక్షణలో తము సైతం ఉంటామని చిన్నారులు ముందుకు వచ్చారు. పట్టణంలోని శ్రీహంసవాహిని ఉన్నత పాఠశాలలో తొమ్మిదేళ్లుగా విద్యార్థులు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఈ సారి సైతం మట్టి వినాయకుడిని ఏర్పాటు చేస్తూ.. తమ తమ గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని, కొంత వరకు మార్పు తీసుకు వస్తున్నామన్నారు.

ఎక్లాస్‌పూర్‌లో... ఏకదంతుడు



జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో పదుల సంఖ్యలో గణేష్‌ విగ్రహాలను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. కానీ నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్‌ గ్రామంలో చిన్న, పెద్ద తేడా లేకుండా ఊరంతా కలిసి ఒకే విగ్రహాన్ని ఏర్పాటు చేసి అక్కడే పూజలు నిర్వహిస్తు వస్తున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరంపర కొనసాగుతుంది. పార్టీలు, కులాలు అనే తేడా లేకుండా ఐక్యమత్యంగా ఉండటాన్ని ఈ గ్రామస్తులు సందేశం అందిస్తున్నారు.

నిమజ్జనం ఎరుగని గణనాథుడు



నారాయణపేట పట్టణంలోని పళ్లబుజూర్గ్‌ ప్రాంతంలోని దీక్షిత్‌ నివాసంలోని గణనాథుడు దాదాపు 700 సంవత్సరాలకు పైగా నిమజ్జనం లేకుండా నిత్యపూజలు అందుకుంటున్నాడు. 13వ శతాబ్దానికి చెందిన గణనాథుతుడిని పూర్వకాలం నుంచి వారి కుటుంబ సభ్యులు కొలుస్తూ వస్తున్నారు. ఇక ఏటా వినాయకచవితి నుంచి 11 రోజులు ఇక్కడ పెద్ద సంఖ్యలో భక్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. సంకష్టచతుర్థి రోజుల్లో సైతం ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు అర్చకులు అప్పణ్ణ దీక్షిత్‌ తెలిపారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

మరికల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన ఘటన శనివారం అర్ధరాత్రి తీలేర్ స్టేజీ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీత రాంతండాకు చెందిన సూర్తమ్మ(75) కుమారుడు బతుకుదెరువు నిమిత్తం ముంబయికి వలస వెళ్లాడు. ఇంటి వద్ద వృద్ధురాలు ఒక్కతే ఉండటంతో ఆమె కొన్నాళ్ల నుంచి మతిస్థిమితం కోల్పోయింది. రోడ్ల వెంట తిరుగుతుండేది. అర్ధరాత్రి సమయంలో తీలేర్ స్టేజీ వద్దకు వచ్చింది. జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలియజేశారు.

బాలుడి మృతదేహం లభ్యం

బిజినేపల్లి: మండలంలోని సాకలివాని చెరువు సమీపంలో కేఎల్ఐ కాల్వ వద్ద బాలుడు మార్కండేయ (7 నెలలు) మృతదేహం లభ్యమైంది. మండలంలోని మంగనూర్‌కు చెందిన లలిత శనివారం మధ్యాహ్నం భర్తపై కోపంతో నలుగురు చిన్నారులను కేఎల్ఐ కాల్వలో పడేయగా.. ముగ్గురు కూతుళ్ల మృతదేహాలు లభ్యమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆచూకీ లభించని మార్కండేయ కోసం ఆదివారం ఉదయం స్థానిక పోలీస్, ఫైర్ సిబ్బంది సంయుక్తంగా గాలింపు చేపట్టగా సాకలివాని చెరువు సమీపంలోని కేఎల్ఐ కాల్వ వద్ద మృతదేహం లభ్యమైంది.

గొర్రెల చోరీకి యత్నం



అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట సమీపంలో గొర్రెల చోరీ కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఆంజనేయులు, నాగసాల, యాదయ్య, నాగప్పలు తమ గొర్రెలను శనివారం రాత్రి గ్రామానికి సమీపంలో నిలుపుకొన్నారు. అర్ధరాత్రి తర్వాత కొందరు గుర్తు తెలియని దొంగలు 10 గొర్రెల కాళ్లకు, మూతికి తాళ్లను కట్టేసి దూరంగా తీసుకెళ్లారు. తర్వాత మళ్లీ వచ్చి మరికొన్ని గొర్రెలను ఎత్తుకెళ్లేందుకు యత్నించగా.. కాపరులు గుర్తించి కేకలు వేశారు. గ్రామస్తులకు ఫోన్లు చేసి కొందరిని పిలిపించడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. ఆదివారం ఉదయం గొర్రెలు నిలిపిన పరిసరాల్లో వెతకగా 4 గొర్రెలు లభించాయి. వాటి మూతులు, కాళ్లకు తాళ్లు కట్టి ఉన్నాయి. మరో 6 గొర్రెలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలియజేశారు.

తల్లీబిడ్డలకు పౌష్టికాహారం

- పథకాల సద్వినియోగంపై అవగాహన
- జిల్లాలో పోషణ్ మాసోత్సవానికి శ్రీకారం

మహబూబ్‌నగర్ రూరల్: మాతా, శిశు సంరక్షణకు అధిక ప్రాధాన్యనిస్తున్న ప్రభుత్వం వారి ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం ప్రతి సంవత్సరం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిశీలనకు పోషణ్ అభియాన్ కార్యక్రమం ద్వారా మాసోత్సవాలు నిర్వహిస్తుంది. సెప్టెంబర్ మొదటి వారం నుంచి నెలాఖరు వరకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ నేతృత్వంలో వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా 4 ప్రాజెక్టుల పరిధిలో 1,184 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. తల్లీబిడ్డ ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుంది. గర్భందాల్చినప్పటి నుంచి ప్రసవమయ్యే వరకు ఆరోగ్యంపై స్త్రీ, శిశు సంక్షేమశాఖ ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహిస్తున్న పోషణ్ అభియాన్ మాసోత్సవాలు పండుగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పోషణ్ మాసం ప్రత్యేక కార్యక్రమాలపై కథనం.

బహుమతుల ప్రదానం

మాసోత్సవంలో పిల్లల ఎత్తులు, బరువులు చూస్తారు. ఆరోగ్యంగా ఉన్న పిల్లలకు బహుమతులు అందజేస్తారు. రక్తహీనత శిబిరాలు నిర్వహించి అవగాహన కల్పిస్తారు. ఈ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించిన సంగతి తెలిసిందే. మాసోత్సవాల్లో ఈ అంశానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. చిన్నారులు నిత్యం పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు పాలు, పండ్లు



అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు గుడ్లు, బాలామృతం ప్యాకెట్లు అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత (ఫైల్)

మొత్తం ప్రాజెక్టులు 4	ప్రధాన, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 1,184
చిన్నారులు 57.379	బాలింతలు 7.792
చిన్నారులు 6,741	

సూచిస్తున్నారు.

జిల్లాలో ఇలా..

ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించే పోషణ్ మాసోత్సవంలో జిల్లాలో 1,184 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన ఆరోగ్య స్క్రీనింగ్ చేస్తారు. ప్రస్తుతం పిల్లల స్క్రీనింగ్ ఈనెల 7వ తేదీ వరకు పూర్తి చేస్తారు. పిల్లల ఎత్తు, బరువు ద్వారా పోషణ లోపం, తీవ్ర పోషణ లోపాన్ని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పోషకాహారానికి సంబంధించి పిల్లల కోసం పోషణ్ ట్రాకర్ యాప్‌ను రూపొందించారు. పోషణ పురోగతిని ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ టీచర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పోషకాహార లోపం ఉంటే అదనపు పోషకాహారం అందిస్తారు.

పథకం లక్ష్యం

- స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలతో తల్లిదండ్రులకు చైతన్యం చేస్తారు. పోషకాహార లోపం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.
- విటమిన్లు, ఐరన్ సమృద్ధిగా ఉన్న వివిధ రకాల పోషకాహారం తీసుకోవాలి. పాలు, నూనె, అయోడిన్ ఉన్న ఉప్పు, నాలుగు నెలలో మొదలుపెట్టి, ఆరో నెల వచ్చే వరకు రోజూ ఒక ఎరుపు రంగు ఐఎఫ్ఏ మాత్ర వేసుకోవాలి. వైద్యులు సూచించిన కాల్షియం మాత్రలు వేసుకోవాలి. శుభ్రమైన నీటిని తాగాలి.
- ప్రసవానికి ముందు కనీసం నాలుగు సార్లు పరీక్షలు చేయించుకోవాలి.
- వంట చేసే ముందు, తినిపించే భోజనానికి ముందు, మల మూత్రాల విసర్జన తర్వాత చేతులను శుభ్రంగా సబ్బుతో కడగాలి.
- బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే ముర్రుపాలు పట్టించాలి. బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లి పాలే ఇవ్వాలి. బిడ్డ ఆరునెలల తర్వాత అదనపు ఆహారం ఇవ్వాలి.
- ఐదు సంవత్సరాల వరకు టీకా పట్టిక ప్రకారం అన్ని టీకాలు వేయించాలి.

తల్లీబిడ్డ ఆరోగ్యానికి ప్రాధాన్యం



తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ఏటా పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తుంది. ముందుగా బరువు తక్కువ, ఎక్కువ పిల్లలను గుర్తించడం, గర్భిణులు, బాలింతలకు యోగా నేర్పించడం, మంచి ఆహారం తీసుకునే విధంగా అవగాహన కల్పిస్తాం. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంతో పాటు తల్లులు కూడా పెరట్లో న్యూట్రీగార్డెన్ పెంచేవిధంగా ప్రోత్సహిస్తున్నాం. తల్లిదండ్రులకు పౌష్టికాహారం, తయారీ విధానం తదితర అంశాల్లో అవగాహన, తల్లి పాలపై గర్భిణులకు వివరిస్తున్నాం.

– ఎల్.శాంతిరేఖ, సీడీపీఓ, మహబూబ్‌నగర్ రూరల్

చిన్నారులపై ప్రత్యేక దృష్టి



పోషణ మాసోత్సవాన్ని జిల్లాలో షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నాం. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుసాగుతుంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మాసోత్సవాన్ని సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటాం. వయస్సుకు తగ్గట్టుగా బరువు లేని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చూస్తున్నాం. నిత్యం పాలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలను ఆహారంలో చేర్చడం ద్వారా ఉండే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– జ్యోతి, ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ, మహబూబ్‌నగర్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించాలి



అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న శరత్‌చంద్ర

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని టీజీపెటా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దూమర్ల నిరంజన్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర అన్నారు. కరీంనగర్‌లో ఈ నెల 30, అక్టోబర్ 1న జరిగే 9వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను ఆదివారం స్థానిక ప్రధాన స్టేడియంలో నిర్వహించారు. ఎంపికలను జెండా ఊపి దూమర్ల నిరంజన్, శరత్‌చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరచాలని కోరారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓడినవారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని సూచించారు. అండర్– 14, 16, 18, 20 బాల, బాలికలకు ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, అథ్లెటిక్స్ కోచ్‌లు సునీల్‌కుమార్, ఆనంద్‌కుమార్, ఎం.శ్రీనివాసులు, పీఈటీలు సి.శ్రీనివాసులు, జి.రాజు, పి.శ్రీనివాస్, దత్తాత్రేయ, జగత్, మొగులాల్ తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో అక్టోబర్ 15 నుంచి 24వ తేదీ నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై ఆదివారం చైర్మన్ చిన్న కృష్ణయ్య నేతృత్వంలో ఈఓ పురేందర్‌కుమార్, ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు సమావేశమయ్యారు. ప్రతి ఏటా నిర్వహించే కార్యక్రమాలతో పాటు మరేమైనా నిర్వహించే అవకాశం ఉందా అని చర్చించారు. ఉత్సవాల సమయంలో అమ్మవారికి అలంకరించే చీర విషయంలో తమదే కట్టించాలంటూ ప్రముఖుల నుంచి వత్తిడులు వస్తున్నాయని అర్చకులు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో లాటరీ విధానాన్ని పాటిద్దామని.. ఏరోజు ఎవరి పేరు వస్తే వారు ఇచ్చిన చీరనే కట్టిద్దామనే నిర్ణయానికి వచ్చారు. అలాగే ఖడ్గమాల, త్రిశతి, సామూహిక కుంకుమార్చనలు, ఉదయాస్తమానసేవ, నవావరణ అర్చన, కుమారి, సువాసిని వంటి పూజా టికెట్ల ధరలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఉదయాస్తమాన సేవలు పెంపొందించేందుకు ఆలయ అర్చకులు కృషి చేయాలని ఈఓ పురేందర్‌కుమార్ కోరారు. అలాగే చండీహోమాలు, అదనపు సిబ్బంది, అర్చకుల విషయం ప్రస్తావనకు రాగా ఆయా అంశాలపై సముచిత నిర్ణయాలు తీసుకోనున్నారు. సమావేశంలో ఆలయ ముఖ్య అర్చకుడు, ఎక్స్ అఫిషియో సభ్యుడు ఆనంద్‌శర్మ, పాలక మండలి సభ్యుడు నీలప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణ, వెంకటేష్, అర్చకులు శ్రీనివాస్‌శర్మ, శ్యాంకుమార్‌శర్మ, విక్రాంత్‌శర్మ, ధనుంజయశర్మ, కృష్ణమూర్తిశర్మ, ప్రహ్లాదాచారి, శ్రీకాంత్‌శర్మ, త్యాగరాజశర్మ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు పెరిగిన వరద

- నెట్టెంపాడు, కుడి, ఎడమ కాల్వలకు కొనసాగుతున్న నీటి సరఫరా
- 3,502 క్యూసెక్కులు దిగువకు..



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం వరద పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం 7 గంటలకు 2 వేల క్యూసెక్కులు ఉండగా.. ఆదివారం సాయంత్రానికి 5 వేల క్యూసెక్కులకు పెరిగిందన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన గుడ్డెందొడ్డి లిఫ్ట్–1 వద్ద ఒక పంపు ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నట్లు వివరించారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100, సమాంతర కాల్వకు 850, భీమా లిఫ్ట్–2కు 750 మొత్తం 3,502 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.296 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు తెలిపారు.

రామన్‌పాడులో 1,020 అడుగులు..



మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,020 అడుగులు ఉంది. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030 క్యూసెక్కులు, సమాంతార కాల్వ నుంచి 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఎన్టీఆర్ కాల్వకు 950 క్యూసెక్కులు, కుడి కాల్వకు 10, ఎడమ కాల్వకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేస్–2కు 858 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో 855.2 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో ఆదివారం 855.2 అడుగుల నీటిమట్టం, 92.4860 టీఎంసీల నీటినిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 2,958, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,510, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 295 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

ప్రతి మనిషికి చేయూతనివ్వాలి



గరికపాటి నర్సింహరావును సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూర్: ప్రతి మనిషి ధైర్యంగా బతికి.. సంతోషంగా చావాలని.. అన్ని ధర్మాలు ఇదే చెబుతున్నాయని పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికపాటి నర్సింహారావు అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లోని ఓ పాఠశాలలో నిత్య జీవితంలో భగవద్గీత అనే అంశంపై సందేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో పగలు, రాత్రి మాదిరిగానే సుఖ, దుఃఖాలు సమానమని.. సుఖానికి సంతోషపడి.. దుఃఖానికి కృంగిపోవడం మనిషి చేతకాని తనానికి నిదర్శమన్నారు. భార్యాభర్తల దాంపత్య జీవితం కుటుంబంతో హాయిగా సాగాలని ఇందుకు సెల్‌ఫోన్‌ను పక్కన బెట్టి కుటుంబానికి సమయం కేటాయిస్తే సరిపోతుందన్నారు. దేశం మీద నమ్మకాన్ని విస్మరిస్తూ తమ పిల్లలను ఉన్నత విద్య పేరిట విదేశాలకు పంపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. దేశంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని చదువుతోపాటు ఇక్కడ సంస్కారం, ప్రేమాభిమానాలు నేర్చుకుంటారని, విదేశాల్లో ఇవి దొరకవని చెప్పారు. సమాజంలోని అందరూ బతకాలని ఆయావృత్తులు, వ్యాపారులను ప్రోత్సహించాలని, అన్నీ తామే పొందాలనుకోవడం అవివేకమని, మనిషికి మనిషి చేయూతనివ్వాలని అందులోనే పరమార్థం ఉందన్నారు. దేశంలో ప్రతిఏటా అవినీతి కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.3 లక్షల కోట్ల నష్టం జరుగుతుందని, అవినీతికి పాల్పడడం, ప్రోత్సహించడం రెండూ నేరమే అన్నారు. సమాజంలో మానవ పరివర్తన, మంచిని భగవద్గీత నేర్పుతుందని, అన్ని ధర్మాలు, శాస్త్రాలు ఇదే చెబుతున్నాయన్నారు. భాష పరిరక్షణకు ప్రతిఒక్కరు బాధ్యత తీసుకోవాలని సూచించారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సదానందగిరి మహారాజ్, ఆచార్య శ్రీనివాస్, వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్, వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ బాలస్వామి తదితరులు మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి నృత్యాలు, అన్నమయ్య సంకీర్తనలు, భగవద్గీత శ్లోకాలు, ఆధ్యాత్మిక గీతాలాపన ఆకట్టుకున్నాయి.

రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రవల్లిచౌరస్తా: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ అశోక్‌బాబు ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గద్వాల మండలం పూడూరుకు చెందిన చాకలి వీరబాబు తన వాహనంలో పెబ్బేరు నుంచి రాయచూరుకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఎర్రవల్లి నుంచి గద్వాల వెళ్లే దారిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా 33 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు వివరించారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌తో పాటు బియ్యం వ్యాపారి తిరుమలాచారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

పొటాష్.. పంటలకు మేలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: పొటాష్ అన్నిరకాల పంటలకు మేలు చేస్తోంది. వీటిని సక్రమంగా వినియోగించుకుంటే చీడపీడల బెడద తగ్గుతుంది. నత్రజని, భాస్వరంతోపాటు పొటాష్ వినియోగం వలన నాణ్యమైన పంట చేతికి వస్తుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియానాయక్ తెలిపారు. మొక్కను గ్రహించిన నత్రజని, భాస్వరంను పొటాష్ వలన పంటలకు కలిగే ప్రయోజనాలను వివరించారు.

ప్రయోజనాలు ఇలా..

నత్రజని అధికం కావడం వలన పంటకు జరిగే నష్టాన్ని నిరోధిస్తుంది. పొటాష్‌తో మొక్కలకు పొడువైన, బలమైన, ఆరోగ్యవంతమైన గుబురు వేర్లు పుడతాయి. భూమిలోకి లోతుగా చొచ్చుకుపోయి వేళ్ల తేమను, పోషకాలను బాగా గ్రహిస్తాయి. గాలులకు వాలిపోవు. వరి కంకుల్లో గింజలు నిండుగా ఏర్పడటానికి తోడ్పడుతుంది. వరి మొక్క బాగా పీచు తేలి దృఢంగా తయారవుతుంది. పోషక పదార్థాలను మొక్కలోని అన్ని బాగాలకు చేరవేయడంలో సహాయపడుతుంది. మొక్కల అభివృద్ధికి కావాల్సిన క్యాల్షియం, మెగ్నీషియం, గంధకం, ఇనుము, తుత్తునాగం వంటి ఉప సూక్ష్మ పదార్థాలు గ్రహించేందుకు సహాయ పడుతుంది. మొక్కలు వేడి, చలి, నీటి ఎద్దడిని తట్టుకొని పరిపుష్టిగా ఉంటాయి.

లోప లక్షణాలు..



వరిలో పొటాష్ లోపం

మొక్క ప్రారంభ దశలో పొటాష్ లోప లక్షణాలు కనిపించవు. అభివృద్ధి చెందని నల్లని వేర్లు పొటాష్ లోపానికి గుర్తు. ఆకులు ముదురు ఆకుపచ్చగా ఉండి వాటి మీద తుప్పు రంగు మచ్చలు ఏర్పడతాయి. క్రమంగా ఇవి మొక్క అంతటా వ్యాప్తి చెందుతాయి. ముదిరిన ఆకులు ఎండి రాలిపోతాయి. మొక్కలు సరిగ్గా ఎదగవు. బలహీనంగా పొట్టిగా ఉంటాయి. పొటాష్ లోపం వలన చాలా రకాల వేర్లు ఒరిగిపోతాయి. చిన్న కంకులు ఏర్పడి పొల్లు గింజలు అధికమవుతాయి. అగ్గి తెగులు, ఆకు మచ్చ తెగులు, సుడి తెగులు, సుడి తెగులు ఉధృతంగా పంటపై ప్రభావం చూపుతాయి.

నివారణ చర్యలు..

భూసార పరీక్షల ఆధారంగా పొటాష్ ఎరువును వినియోగించాలి. సాధారణంగా వరికి ఎకరాకు 18 కిలో పొటాష్ వేస్తే సరిపోతుంది. సిఫార్సు చేసిన మోతాదును రెండు సమ భాగాలుగా చేసి చివరి దమ్ములో, సిరుపొట్ట దశలో వేయాలి. పొటాష్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయడం వలన అధిక ప్రయోజనం ఉంటుంది. జింకు లోపం ఉన్న భూముల్లో పొటాష్ మొత్తం యూరియాతోపాటు దమ్ములోనే వేయాలి. వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటల్లో పొటాష్ బాగా పనిచేస్తుంది.

కుమారుడు కొట్టాడని తల్లి ఆత్మహత్య

- మూడురోజుల తర్వాత వెలుగులోకి..
- కేఎస్పీ కుడి కాల్వలో తేలిన మృతదేహం



రాధమ్మ(ఫైల్)

మరికల్: మద్యం మత్తులో ఉన్న కుమారుడు తల్లిని కొట్టడంతో మనస్తాపానికి గురై మూడు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన ఆమె ఆదివారం కోయిల్‌సాగర్ కుడి కాల్వలో శవమై కనిపించిన ఘటన పూసల్‌పహాడ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూసల్‌పహాడ్‌కు చెందిన రాధమ్మ(45) కుమారుడు శివకుమార్‌రెడ్డి ఈ నెల 14న రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇలా రోజూ మద్యం తాగి ఇంటికి వస్తే కుటుంబం ఎలా గడుస్తుందని తల్లి కుమారుడిని నిలదీసింది. ఆగ్రహానికి గురైన కుమారుడు తల్లిని కొట్టాడు. ఆమె మనస్తాపానికి గురై అదే రోజు రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. మరుసటి రోజు కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా లాభం లేకపోయింది. భర్త రాజారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. చివరకు అనుమానం వచ్చిన గ్రామస్తులు కోయిల్‌సాగర్ కుడి కాల్వకు వస్తున్న నీటిని నిలిపి వేయించారు. మూడు రోజుల తర్వాత వెంకటాపూర్ గ్రామ శివారులో కుడి కాల్వ ముళ్లపొదలో చిక్కుకున్న రాధమ్మ మృతదేహాన్ని కుటుంబసభ్యులు గుర్తించారు. నారాయణపేట ఏరియా ఆస్పత్రిలో పోస్టుమర్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలియజేశారు.

ద్విచక్రవాహనం, లారీ ఢీ: భార్యాభర్తలు మృతి



నాగయ్య(ఫైల్)



పార్వతమ్మ(ఫైల్)

కల్వకుర్తి రూరల్/ మిడ్జిల్: మండలంలోని మార్చాల గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనం, లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణం చేస్తున్న భార్యాభర్తలు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల బోయిన్‌పల్లికి చెందిన నాగయ్య(50), భార్య పార్వతమ్మ(45) సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు కల్వకుర్తి సంతకు వెళ్లారు. సామగ్రి కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై తమ సొంత గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. అదే సమయంలో జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న లారీ, ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వాహనం పైనుంచి ఎగిరిపడి భార్యాభర్తలు మృతిచెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న కల్వకుర్తి పోలీసులు మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై వారి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ రమేష్ తెలియజేశారు.

బోయిన్‌పల్లిలో విషాదం..



అనాథలుగా మిగిలిన అన్నదమ్ములు శివ, శ్రీకాంత్

వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు శివ గ్రామంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అతనికి 8 సంవత్సరాల తమ్ముడు శ్రీకాంత్ ఉన్నాడు. వీరు సెలవు దినాల్లో గొర్రెలను మేపేందుకు వెళ్లి తల్లిదండ్రులకు సాయం చేస్తుండేవారు. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లల్ని గొర్రెలను మేపేందుకు పంపించి, ఇంటి సరుకుల కోసం కల్వకుర్తికి వెళ్లి యాక్సిడెంట్‌కు గురయ్యారు. తల్లిదండ్రులను కోల్పోయి అన్నదమ్ములు ఇద్దరు అనాథలుగా మిగిలారు.

కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లలు మృతి



మృతిచెందిన గొర్రెపిల్లలు

ఊట్కూర్: కుక్కల దాడిలో 25 గొర్రెపిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని కొల్లూరు శివారులో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కొల్లూరుకు చెందిన గడ్డం రాజు గ్రామశివారులో 25 గొర్రె పిల్లలను చెట్టు కింద వలలో ఉంచి గొర్రెలను తీసుకొని మేపునకు సమస్తాపూర్ శివారుకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో కుక్కలు వలలో ఉన్న గొర్రె పిల్లలపై దాడి చేశాయి. సాయంత్రం వచ్చి చూడగా అప్పటికే మృతిచెంది కనిపించాయి. సుమారు రూ.1.85 లక్షల నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.